ప్రజాశక్తి
బుధవారం 7 ఆగస్టు 2024
5
విజయనగరం

ఏకగ్రీవంగా స్టాండింగ్ కమిటీ ఎన్నిక

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

నగరపాలక సంస్థ స్టాండింగ్ కమిటీ సభ్యులుగా ఐదుగురు సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు కమిషనర్ ఎం ఎం నాయుడు ఓ ప్రకటనలో తెలిపారు. 15వ డివిజన్ కార్పొరేటర్ అల్లు చాణక్య, 33వ డివిజన్ కార్పొరేటర్ గొల్లపల్లి వెంకట రంగారావు, 12వ డివిజన్ కార్పొరేటర్ రేగాన రూపాదేవి, 14 డివిజన్ కార్పొరేటర్ శెట్టి వీర వెంకట రాజేశ్వరరావు, 41వ డివిజన్ కార్పొరేటర్ సుంకరి నారాయణస్వామి ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ఆయన తెలిపారు. వీరిని మేయర్ విజయలక్ష్మి, డిప్యూటీ మేయర్లు కోలగట్ల శ్రావణి, ముచ్చు లయాయాదవ్, వివిధ డివిజన్ల కార్పొరేటర్లు, నగరపాలక సంస్థ కమిషనర్ నాయుడు ఎం ఎం నాయుడు, కార్యాలయ సిబ్బంది అభినందనలు తెలిపారు.

స్టాక్ పాయింట్ నుంచి వెళ్తున్న ఇసుక లారీలు

- స్టాక్ పాయింట్‌లో పనిచేయని సిసి కెమెరాలు, వేబ్రిడ్జి
- ఇదే అదునుగా అక్రమాలకు పాల్పడుతున్నసిబ్బంది
- సామర్థ్యాన్ని మించి ఇసుక లోడింగ్

ఇసుక అమ్మకాల్లో అక్రమాలు

ప్రజాశక్తి-బొబ్బిలి

ప్రభుత్వం సరఫరా చేస్తున్న ఇసుక స్టాక్ పాయింట్ లో అక్రమాలు జరుగుతున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి. ప్రజలకు ఇసుక సరఫరా చేసేందుకు గ్రోత్ సెంటర్లో ఇసుక స్టాక్ పాయింట్ ఏర్పాటు చేశారు. ఇసుక అమ్మకాల్లో అక్రమాలు నివారించేందుకు సీసీ కెమెరాలు, వేబ్రిడ్జి ఏర్పాటు చేసినప్పటికి అవేవి పని చేయడం లేదు. ఇదే అదునుగా భావిస్తున్న ఇసుక స్టాక్ పాయింట్ లో పని చేస్తున్న ఉద్యోగులు అక్రమాలకు పాల్పడుతున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి. ఇసుక స్టాక్ పాయింట్ లో అక్రమాలను నివారించే ందుకు సిసి కెమెరాలు ఏర్పాటు చేసినప్పటికీ అవి పని చేయడం లేదు. దీంతో ఇష్టానుసారంగా ఇసుక అమ్ముకుని సొమ్ము చేసుకుంటున్నారని విమర్శలు వస్తున్నాయి. ఇసుక పాయింట్ లో పని చేస్తున్న ఉద్యోగులు ట్రాక్టర్, లారీ డ్రైవర్లతో కుమ్మక్కై తక్కువ ఇసుకకు బిల్లు ఇచ్చి ఎక్కువ ఇసుక ఇస్తున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి.

ఒకే బిల్లుపై మూడు లోడ్లు తరలింపు

సిసి కెమెరాలు పని చేయకపోవడంతో కాంట్రాక్టర్లు ఒక బిల్లుపై మూడు లోడ్ల వరకు ఇసుక తరలిస్తున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి. ఒకే బిల్లుపై మూడు లోడ్లు తరలించి మిగిలిన రెండు లోడ్ల డబ్బులు కాంట్రాక్టర్లు, ఇసుక పాయింట్ లో పని చేస్తున్న ఉద్యోగులు పంచుకుంటున్నట్లు విమర్శలు వస్తున్నాయి.

పనిచేయని వేబ్రిడ్జి

ఇసుక స్టాక్ పాయింట్ లో వేబ్రిడ్జి పని చేయడం లేదు. టన్ను ఇసుక రూ.605గా ప్రభుత్వం నిర్ణయించింది. ట్రాక్టర్, లారీకి ఎన్ని టన్నులు ఇసుక లోడ్ చేస్తే అన్ని టన్నులు బిల్లు వసూలు చేయాలి, వేబ్రిడ్జి పని చేయకపోవడంతో నాలుగు టన్నులు ఇసుక పట్టే ట్రాక్టర్ కు 5 నుంచి 6టన్నులు ఇసుక వేసి నాలుగు టన్నులకు మాత్రమే బిల్లు తీసుకుని ప్రభుత్వానికి జమ చేసి మిగిలిన ఇసుక డబ్బులను జేబులో వేసుకుంటున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి. అధికారులు స్పందించి ఇసుక అమ్మకాల్లో అక్రమాలను నివారించి వేబ్రిడ్జి పని చేసేలా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

స్టాక్ పాయింట్‌లో లారీలో ఇసుకను లోడ్ చేస్తున్న సిబ్బంది

జిల్లా పరిస్థితులపై కలెక్టర్ నివేదిక

ప్రజాశక్తి-విజయనగరం

అమరావతి సచివాలయంలో సోమవారం జరిగిన జిల్లా కలెక్టర్ల సదస్సులో పాల్గొన్న జిల్లా కలెక్టర్ డాక్టర్ బిఆర్ అంబేద్కర్ వివిధ అంశాల్లో జిల్లా పరిస్థితులను వివరిస్తూ ప్రజెంటేషన్ ఇచ్చారు. జిల్లాలో వ్యవసాయ అనుబంధ రంగాల్లో గత దశాబ్ద కాలంలో పరిస్థితిని తెలుపుతూ నివేదిక అందజేశారు. జిల్లాలో ప్రధాన పంటల దిగుబడి, జిల్లా ఆర్థిక అభివృద్ధిలో వ్యవసాయ రంగం పాత్ర తదితర అంశాలను కలెక్టర్ వివరించారు. జిల్లాలో ఈ ఏడాది 3600 హెక్టార్లలో సూక్ష్మ సేద్యం, 1500 హెక్టార్లలో ఆయిల్ పామ్ పంట సాగును లక్ష్యంగా నిర్ణయించినట్లు వ్యవసాయ శాఖ ముఖ్య కార్యదర్శి బి రాజశేఖర్ తెలిపారు. గనులు, మైనింగ్ ద్వారా 2023-24 లో రూ 125 కోట్లు ఆదాయం జిల్లా నుంచి లభించగా 2024-25 సంవత్సరానికి రూ. 135 కోట్లు లక్ష్యంగా నిర్ణయించినట్లు ఆ శాఖ ముఖ్య కార్యదర్శి ముఖేష్ కుమార్ మీనా తెలిపారు. రాయగడ, రామభద్రపురం, చిలక పాలెం స్టేట్ హైవే, విజయనగరం- పాలకొండ రోడ్లను పబ్లిక్, ప్రైవేట్ భాగస్వామ్య విధానంలో(పి.పి.పి) విధానంలో అభివృద్ధి చేసేందుకు ప్రతిపాదిస్తున్నట్లు రోడ్లు భవనాల శాఖ ముఖ్య కార్యదర్శి కాంతిలాల్ దండే ఈ సమావేశంలో తెలిపారు.

ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రులను కలిసిన కలెక్టర్, ఎస్‌పి

జిల్లా కలెక్టర్‌లు, ఎస్‌పిలతో అమరావతి సచివాలయంలో నిర్వహించిన సమావేశంలో పాల్గొన్న జిల్లా కలెక్టర్ డాక్టర్ బి ఆర్ అంబేద్కర్, జిల్లా ఎస్‌పి వకుల్ జిందాల్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ లను కలిశారు. జిల్లా కలెక్టర్‌లు, ఎస్‌పిలకు ఏర్పాటు చేసిన విందు సందర్భంగా జిల్లా ఉన్నతాధికారులు సిఎం, డిప్యూటీ సిఎంలను కలసి జిల్లా అభివృద్ధికి సంబంధించిన ముఖ్య విషయాలను వారితో చర్చించారు. జిల్లాకు సంబందించి శాంతి భద్రతల పరిస్థితి తదితర అంశాలపై వారికి కలెక్టర్, ఎస్‌పిలు వివరించారు.

సిఎం చంద్రబాబుతో మాట్లాడుతున్న కలెక్టర్ అంబేద్కర్, ఎస్‌పి వకుల్ జిందాల్

చిట్టెంపాడులో డయేరియా

గిరిజనుడు మృతి
గుండెపోటుతో చనిపోయినట్లు వైద్యుల రిపోర్టు

ప్రజాశక్తి-శృంగవరపుకోట

మండలంలోని మూల బొడ్డవర పంచాయతీ గిరిశిఖర గ్రామమైన చిట్టెంపాడు గ్రామంలో డయేరియా విజృంభిస్తోంది. ఆరు రోజుల క్రితం ఈ గ్రామానికి చెందిన సుమారు 20 మంది విద్యార్థులు డయేరియా సోకి పట్టణంలోని సిహెచ్‌సిలో చేరి చికిత్స పొందిన విషయం తెలిసిందే. అప్పటినుంచి చిట్టెంపాడు గ్రామంలో డయేరియాతో మంచాన పడిన వారి సంఖ్య పెరుగుతూనే ఉంది. గ్రామంలో పలువురు ఇంటి వద్దే ఉంటూ చికిత్స పొందుతుండగా, మరికొందరు ఎస్.కోట సిహెచ్‌సిలో చికిత్స పొందుతున్నారు.

తాజాగా గ్రామానికి చెందిన సోముల సన్యాసి (68) వాంతులు, విరేచనాలతో బాధపడుతూ పట్టణంలోని సామాజిక ఆరోగ్య కేంద్రంలో చేరాడు. సోమవారం సాయంత్రం పరిస్థితి విషమించి మృతి చెందాడు. అయితే వైద్యాధికారులు మాత్రం సోములు గుండెనొప్పితో మృతి చెందాడని రిపోర్టు ఇచ్చినట్లు బాధిత కుటుంబీకులు చెబుతున్నారు. డయేరియా ఉన్న విషయాన్ని దాచిపెట్టేందుకే ఇలా తప్పుడు రిపోర్టులు ఇస్తున్నారని ఆదివాసీ గిరిజన సంఘం నాయకుడు గౌరీష్ అన్నారు. వైద్యాధికారులు ప్రత్యేక వైద్య శిబిరాలను ఏర్పాటు చేసి వైద్యం అందించకపోవడమే డయేరియా మరింత ప్రబలడానికి కారణమని గిరిజనులు వాపోతున్నారు. అయితే చిట్టెంపాడులో డయేరియా ఉన్న మాట వాస్తవమేనని, రక్త పరీక్షలు చేసి వైద్యసేవలు అందిస్తున్నామని బొడ్డవర పిహెచ్‌సి వైద్యులు శిరీష తెలిపారు. ఈ నేపథ్యంలో మంగళవారం చిట్టెంపాడులో వైద్య శిబిరం ఏర్పాటు చేసిన వైద్యసేవలు అందించారు. స్థానిక టిడిపి నాయకులు వెళ్లి రోగులను పరామర్శించారు.

మృతి చెందిన సోములు

ర్యాగింగ్‌తో జీవితాలను నాశనం చేసుకోవద్దు : ఎస్‌పి

ప్రజాశక్తి-విజయనగరంకోట

ర్యాగింగ్‌కు పాల్పడి జీవితాలను నాశనం చేసుకోవద్దని విద్యార్థులకు ఎస్‌పి వకుల్ జిందాల్ సూచించారు. తోటి విద్యార్థులను కించపర్చినా, నిర్బంధించినా, దాడులకు పాల్పడిన చట్ట ప్రకారం చర్యలు తప్పవని హెచ్చరించారు. విద్యార్థులతో స్నేహభావంతో మెలగాలని పిలుపునిచ్చారు. జిల్లాలో వివిధ ఇంజనీరింగ్ కళాశాలల్లో నూతన విద్యా సంవత్సరం ప్రారంభం కావడంతో పోలీసు అధికారులు, సిబ్బంది తమ స్టేషను పరిధిలోగల ఇంజనీరింగ్ కళాశాలలను, ఇతర విద్యాలయాలను సందర్శించి ర్యాగింగ్ వల్ల కలిగే అనర్థాలపై విద్యార్థులకు అవగాహన కల్పించాలని తెలిపారు. సీనియరు విద్యార్థులు తోటి విద్యార్థుల పట్ల శృతిమించి ప్రవర్తిస్తే, వారిపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించాలన్నారు. కళాశాల యాజమాన్యాలు కూడా ర్యాగింగు నియంత్రణకు చర్యలు చేపట్టాలని, విద్యార్థులు, అధ్యాపకులతో కమిటీలు ఏర్పాటు చేయాలని, ఏ చిన్న సమస్య తలెత్తినా, ప్రాథమిక స్థాయిలోనే వాటిని పరిష్కరించే విధంగా చర్యలు చేపట్టాలని తెలిపారు. విద్యార్థులు మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలన్నారు. సైబరు మోసాల పట్ల అప్రమత్తంగా ఉండాలని, మొబైల్స్కు వచ్చే తెలియని యాప్‌లు, లింకులపై క్లిక్ చేయవద్దని, ఒటిపి లను ఎవ్వరికీ చెప్పవద్దని, ఎస్.బి.ఐ. రివార్డు పాయింట్ల పేరుతో వచ్చే మెసేజ్లను నమ్మవద్దని విద్యార్థులు, ప్రజలకు ఎస్‌పి సూచించారు. ఎస్‌పి ఆదేశాలతో విజయనగరం డిఎస్‌పి ఆర్.గోవిందరావు భీమసింగిలో కళాశాలను, భోగాపురం సిఐ జి. రామకృష్ణ ఎంవిఆర్ ఇంజినీరింగ్ కళాశాలను, ఎస్.కోట ఎస్ఐ గంగరాజు జిల్లా పరిషత్ పాఠశాలను, విజయనగరం రూరల్ ఎస్ఐ ఆర్.వాసుదేవ్ వేణుగోపాలపురంలోని డైట్ కాలేజిని సందర్శించి, విద్యార్థులకు ర్యాగింగ్ వల్ల కలిగే అనర్థాలపై అవగాహన కల్పించారు. మాదక ద్రవ్యాల వినియోగం వలన కలిగే అనర్థాలను వివరించడంతోపాటు, రహదారి భద్రత, మహిళల భద్రత పట్ల అవగాహన కల్పించారు.

రాత్రి పెట్రోలింగు అధికారులను అప్రమత్తం చేయండి

నేరాల నియంత్రణకు కంట్రోల్ రూం సిబ్బంది అప్రమత్తంగా వ్యవహరించాలని ఎస్‌పి వకుల్ జిందాల్ సూచించారు. డయల్ 100, ఉమెన్ సేఫ్టీ ఎస్ఓఎస్ కాల్స్‌పై తక్షణమే స్పందించాలని అన్నారు. జిల్లా వ్యాప్తంగా నేరాలను నియంత్రించేందుకు పోలీసు అధికారులు, సిబ్బంది చేపట్టే రాత్రి పెట్రోలింగు, గస్తీలను నిరంతరం పర్యవేక్షించి, ఎప్పటికప్పుడు వారిని అప్రమత్తం చేయాలన్నారు. జిల్లా వ్యాప్తంగా రాత్రి విధులను పర్యవేక్షించేందుకు ప్రత్యేకంగా నియమించిన అలెర్టింగ్ అధికారులకు ఎప్పటికప్పుడు సమాచారం అందించాలని, గస్తీ సిబ్బందిని కూడా అప్రమత్తం చేసి, జిల్లాలో ఎక్కడా నేరాలు జరగకుండా చూడాలన్నారు. ఆయన వెంట స్పెషల్ బ్రాంచి సిఐ ఇ.నర్సింహమూర్తి, కంట్రోల్ రూం సిఐ రాజశేఖర్, ఎస్ఐలు, సిబ్బంది ఉన్నారు.

కంట్రోల్ రూంను పరిశీలిస్తున్న ఎస్‌పి వకుల్ జిందాల్

వంద రోజులకు ప్రణాళికలు సమర్పించాలి

ప్రజాశక్తి-విజయనగరంకోట

అన్ని ప్రభుత్వ శాఖలు తనవద్ద నున్న పథకాల , కార్యక్రమాల అభివృద్ధి కోసం 100 రోజులకు, ఒక ఏడాదికి వేర్వేరుగా ప్రణాళికలు తయారు చేయాలని సంయుక్త కలెక్టర్ కార్తీక్ తెలిపారు. ముఖ్యమంత్రి చంద్ర బాబు నాయుడు ప్రకటించిన విజన్ 2047 డాక్యుమెంట్ లో భాగంగా అన్ని జిల్లాల కలెక్టర్లు సూక్ష్మ, దీర్ఘకాలిక ప్రణాళికలు వేసుకొని కార్యాచరణ చేపట్టాలని ఆదేశించిన నేపథ్యంలో జెసి మంగళవారం అన్ని శాఖల అధికారులతో సమీక్షించారు. శాఖల వారీగా వారు తయారు చేసిన ప్రణాళికలను అధికారులు వివరించారు. పనుల విషయంలో 20 శాతం కన్నా తక్కువ పెండింగ్ ఉన్న వాటిని 100 రోజుల ప్రణాళికలో చేర్చాలని సూచించారు. జూమ్ కాన్ఫరెన్స్ లో వ్యవసాయ అనుబంధ శాఖలు, పరిశ్రమలు, ఎపి ఐఐసి, వైద్య, విద్యుత్, విద్యా శాఖ, ఆర్ అండ్ బి, ఐ సి డి ఎస్, పౌర సరఫరా, స్కిల్ డెవలప్మెంట్, డి.ఆర్.డీ.ఏ, ఐ సి డి ఎస్, అటవీ శాఖల అధికారులు వారి లక్ష్యాలను వివరించారు.

మాతా శిశు మరణాలను అరికట్టాలి : డిఎంహెచ్‌ఒ

ప్రజాశక్తి - పూసపాటిరేగ

మాతా శిశు మరణాలను అరికట్టడంలో ప్రతి ఒక్కరూ భాగ్యస్వామ్యం కావాలని డిఎంఅండ్‌హెచ్‌ఒ భాస్కరరావు అన్నారు. స్థానిక పిహెచ్‌సిలో మంగళవారం నిర్వహించిన ఆశాడే సమావేశంలో ఆశాలకు దిశా నిర్దేశం చేశారు. జూలైలో జిల్లాలో అత్యధిక ప్రసవాలు చేసినందుకు గాను వైద్యాధికారి, సిబ్బందికి ముందుగా అభినందనలు తెలిపారు. మాతా శిశు మరణాలను 2027 నాటికి ప్రస్తుతం ఉన్న 60 నుండి 20 తగ్గించాలన్నారు. ప్రతి గర్భిణీని 15 రోజులకొకసారి సందర్శించి తల్లులకు ఆరోగ్య పరిరక్షణ చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ఆగస్టు 20న జరగనున్న జాతీయ నులిపురుగుల దినోత్సవంలో ప్రభుత్వ, ప్రయివేట్ పాఠశాలలు, కళాశాలలలో విద్యార్థులకు ఆల్బెండిజోల్ మాత్రలు మింగించాలన్నారు. ఏ ఒక్కరూ రక్తహీనతకు గురికాకుండా ఐరన్ మాత్రలు వేయించాలన్నారు. పిహెచ్‌సిల్లో సహజ ప్రసవాలు జరిగేలా గర్భిణులను ప్రోత్సహించాలని, తల్లి పాల ప్రాముఖ్యతపై శిశుసంక్షేమ శాఖతో సమన్వయం చేసుకుని అవగాహన కార్యక్రమాలను చేపట్టాలని చెప్పారు. సీజనల్‌గా వచ్చే మలేరియా, డెంగీ వ్యాధుల వ్యాప్తి, నివారణ చర్యలపై గ్రామాల్లో అవగాహణ కల్పించాలన్నారు. కార్యక్రమంలో జిల్లా ఎపిడిమియా లాజిస్ట్ డాక్టర్ వెంకటేష్, వైద్యా ధికారి డాక్టర్ రాజేష్ వర్మ, జిల్లా వైద్య ఆరోగ్యాశాఖ కార్యాలయ సిబ్బంది కమ్యూనిటీ హెల్త్ ఆఫీసరు చంద్ర శేఖర రాజు, హెల్త్ ఎడ్యుకేటర్ అనిల్ ప్రేమ్ కుమార్, పిహెచ్‌సి సిబ్బంది వేదమని, ఆర్‌వి రమణ, మిడ్ లెవెల్ హెల్త్ ప్రొవైడర్‌లు, ఎఎన్ఎమ్‌లు, ఆశాలు పాల్గొన్నారు.

సిబ్బందిని ఉద్దేశించి మాట్లాడుతున్న డిఎంహెచ్‌ఒ భాస్కరరావు

నాయకత్వ లక్షణాలు అలవర్చుకోవాలి

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

నగరంలో నూతనంగా ప్రారంభించిన నారాయణ ఇంగ్లీష్ మీడియం పాఠశాలలో విద్యార్థుల నాయకుల ప్రమాణ స్వీకరోత్సవం అట్టహాసంగా జరిగింది. ముఖ్య అతిథిగా స్థానిక సిఐ శ్రీనివాసరావు హాజరయ్యారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థి దశ నుండే నాయకత్వ లక్షణాలు అలవరుచుకోవాలని, నేటి బాలలే రేపటి పౌరులని అన్నారు. పాఠశాల ప్రిన్సిపాల్ కె. రమేష్ మాట్లాడుతూ విద్యార్థులకు క్రమశిక్షణ అత్యంత కీలకమని చెప్పారు. విశిష్ట అతిథులుగా వైజాగ్ జోన్ ఎ. జి.యమ్ శివరామ్ , ఆర్ఐ నవీన్ కుమార్, ఎన్.సన్యాసిరావు, రవికిషోర్, మ్యూఆర్.యస్.టి నీతూ, కో-ఆర్డినేటర్లు వాణీ, సంగీత పట్టణ బలింపియాడ్ ప్రిన్సిపాల్స్ శ్యామ్ , ప్రభావతి తదితరులు పాల్గొన్నారు.

వసతి గృహం నిర్వహణకు దరఖాస్తులు ఆహ్వానం

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

సమగ్ర శిక్ష ఆధ్వర్యంలో నడుస్తున్న అణగారిన పిల్లల వసతి గృహం (నేతాజీ సుభాష్ చంద్ర బోస్ అవస్య విద్యాలయం) నిర్వహణకు అర్హత గల గుర్తింపు కలిగిన ఎన్‌జిఒ లు దరఖాస్తు చేసుకోవాలని డిఇఒ ఎన్.ప్రేమ్‌కుమార్ తెలిపారు. ఈనెల 7 నుంచి 12వ తేదీ వరకు సమగ్ర శిక్ష, విజయనగరం కార్యాలయంలో దరఖాస్తు చేయాలని తెలిపారు. ఎన్‌జిఒలుగా ప్రభుత్వ అనుమతితో రిజిస్ట్రేషన్ లేదా గుర్తింపు పొంది ఉండాలని తెలిపారు. ఎన్‌జిఒ సొసైటీ రిజిస్ట్రేషన్ వివరాలు జత పర్చాలన్నారు. మూడేళ్ల ఐటి రిటన్స్ వివరాలు ఉండాలని తెలిపారు.

ఇంటర్ విద్యార్థులకు పుస్తకాలు పంపిణీ

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

నగరంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్ చదువుతున్న విద్యార్థులకు మంగళవారం ఎమ్మెల్యే పి.అదితి విజయలక్ష్మి గజపతిరాజు టెస్టు బుక్స్, నోట్ బుక్స్, బ్యాగ్‌లను పంపిణీ చేశారు. టిడిపి కూటమి ప్రభుత్వం నూతనంగా తీసుకున్న నిర్ణయం మేరకు వీటిని అందజేసినట్లు తెలిపారు. ఈ సందర్భంగా కళాశాలలో క్లాస్ రూమ్ లో ఏర్పాటు చేసిన డిజిటల్ బోర్డును ప్రారంభించారు. కళాశాల ప్రాంగణంలో మొక్కలను నాటారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ అధ్యాపకులు, విద్యార్థులు, టిడిపి నాయకులు పాల్గొన్నారు.

పైడితల్లి అమ్మవారి ఆలయంలో అన్నదానం

రైల్వే స్టేషన్ దరి పైడితల్లి అమ్మవారి వనం గుడిలో అన్న ప్రసాద వితరణ కార్యక్రమాన్ని ఎమ్మెల్యే అదితి విజయలక్ష్మి గజపతిరాజు ప్రారంభించారు. కార్యక్రమంలో ఆలయ ఇఒ ప్రసాదరావు, పూజారి బంటుపల్లి వెంకట్రావు, తదితరులు పాల్గొన్నారు.

అవయవదానంపై అవగాహన

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

ప్రపంచ అవయవ దానం వారోత్సవాల్లో భాగంగా జెవివి, గాంధీ బ్లడ్ డోనర్స్ క్లబ్ ఆధ్వర్యాన మంగళవారం మహాలక్ష్మి జూనియర్ కళాశాలలో విద్యార్థులకు అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా జెవివిజిల్లా అధ్యక్షులు ఎంవిఎన్ వెంకటరావు, గాంధీబ్లడ్ డోనర్స్ క్లబ్ వ్యవస్థాపకులు అబ్దుల్ రవూఫ్ మాట్లాడారు. అవయవాలను ఎవరు దానం చేయవచ్చునో వివరించారు. అవయవ దానం ఒక సామాజిక బాధ్యత అని అన్నారు. కళాశాల డైరెక్టర్ సి.హెచ్ వెంకటరావు మాట్లాడుతూ అవయవదానం పునర్జన్మనిస్తుందన్నారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ ఎ.సింహాచలంనాయుడు పాల్గొన్నారు.



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న జెవివి జిల్లా అధ్యక్షులు ఎంవిఎన్ వెంకటరావు

ఎమ్మెల్యేతో కమిషనర్ వాగ్వివాదం

ఆస్పత్రిలో టాయిలెట్‌ల స్థలం విషయమై చర్చ • పర్యటన నుంచి వెనుదిరిగిన కమిషనర్

ప్రజాశక్తి-విజయనగరం కోట

జిల్లా కేంద్రాస్పత్రి ఆవరణలో ఏర్పాటు చేయదలచిన పే యూజ్ టాయిలెట్ స్థల విషయమై ఎమ్మెల్యే అదితి విజయలక్ష్మి గజపతిరాజుతో కార్పొరేషన్ కమిషనర్ ఎంఎం నాయుడు వాగ్వివాదానికి దిగారు. అభివృద్ధికి సహకరించాలని కోరిన ఎమ్మెల్యేతో వ్యాపారం బాగా జరిగితేనే పేఅండ్ యూజ్ టాయిలెట్ల నిర్మాణానికి కాంట్రాక్టర్లు ముందుకు వస్తారని, మీరు చెప్పిన చోట ఏర్పాటు చేయడం కుదరదంటూ ఖరాఖండిగా చెప్పేశారు. అంతేకాకుండా అక్కడ నుంచి వెనుదిరిగారు.

జిల్లాకేంద్రాస్పత్రిలో కొత్తగా ఏర్పాటు చేసిన వీల్‌చైర్లను ఎమ్మెల్యే పి.అదితివిజయలక్ష్మి గజపతిరాజు మంగళవారం ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ముందు కమిషనర్‌తో ఎమ్మెల్యే మాట్లాడుతూ గతంలో మన మంత్రి కొండపల్లి శ్రీనివాసరావు హాస్పిటల్‌ను పరిశీలించినప్పుడు టాయిలెట్స్ నిర్మాణం కోసం ఒక స్థలాన్ని ఒపి చీటీలు రాసే భవనం పక్క చూపించామని, అది ఎంతవరకు వచ్చిందని అడిగారు. కమిషనర్ స్పందిస్తూ అస్థలంలో అయితే వద్దని, అవి పే అండ్ యూజ్ టాయిలెట్లు కాబట్టి వాటిని ఏర్పాటు చేసేవారు ముందుకు రారని, మెయిన్‌గేటు పక్కన ఏర్పాటు చేస్తే వారి వ్యాపారానికి బాగుంటుందని బదులిచ్చారు. దీంతో ఎమ్మెల్యే 'అదేంటి మీరు అలా మాట్లాడతారు. మినిస్టర్ ఉన్నప్పుడు మీరు ఊ కొట్టారు. ఇప్పుడు ఇలా ఎలా మాట్లాడతారు .హాస్పిటల్ ఎదురుగా అయితే ఇటు పబ్లిక్‌కు, పేషెంట్లకు అనేక ఇబ్బందులు వస్తాయి. విపరీతమైన దుర్వాసన కూడా వస్తుంది' అని అన్నారు. అలా కుదరదని కమిషనర్ వాగ్వివాదానికి దిగారు. అనంతరం వీల్‌చైర్ల ప్రారంభం అనంతరం ఎమ్మెల్యేకు కనీసం చెప్పకుండా కమిషనర్ అక్కడి నుంచి వెళ్లిపోయారు. అనంతరం ఎమ్మెల్యే ఆస్పత్రిలోజనరల్ వార్డులను పరిశీలించి రోగులతో మాట్లాడారు. వాస్తవ ఇబ్బందులు ఏమిటో చెప్పాలని వైద్యులను కోరారు. బెడ్‌లు చాలక చాలా ఇబ్బంది పడుతున్నారని, ఒక బెడ్‌పై ఇద్దరు ఉంటున్నారని, మెడికల్ కాలేజి వచ్చిన తరువాత రోగుల తాకిడి పెరిగిందని వైద్యులు, సిబ్బంది తెలిపారు. అదనంగా మరో 150 పడకలకు ఏర్పాటుకు భవనం నిర్మించాలని కోరారు. డ్రైనేజీ సిస్టం బాగోకపోవడంతో చాలా ఇబ్బంది ఎదుర్కోవాల్సి వస్తుందని తెలిపారు. ఎలక్ట్రిసిటీ కూడా ఎక్కువ వాడకం వల్ల ఫ్లెక్సివేషన్ ఎక్కువగా జరుగుతోందని,ఇది రోగుల వైద్యానికి ఇబ్బందిగా మారిందని తెలిపారు. హాస్పిటల్‌లో వేస్ట్ మెటీరియల్ వేసిన ప్రదేశాన్ని కూడా ఎమ్మెల్యే పరిశీలించారు. అక్కడ చెత్త బాగా పేరుకుపోవడంతో ఎమ్మెల్యే వైద్యులను ప్రశ్నించారు. మున్సిపాలిటీ ట్రాక్టర్ రోజూ రావడం లేదని,మూడు రోజులకు ఒకసారి రావడంతో చెత్త పేరుకుపోతోందని తెలిపారపు. ఎమ్మెల్యే స్పందిస్తూ ఆస్పత్రిలో వాడే వేస్ట్ మెటీరియల్‌ను, చెత్తను ఎప్పటికప్పుడు తొలగించకపోతే మరింత రోగాలు వచ్చే ప్రమాదం ఉందని, ఏంటండీ ఈ పరిస్థితి అని సూపరింటిండెంట్ అప్పల నాయుడును ఉద్దేశించి అన్నారు. కమిషనర్ ఎక్కడున్నారు అని అడిగేసరికి ఆయన లేకపోవడంతో అవాక్కయ్యారు. మున్సిపల్ కమిషనర్ హాస్పిటల్ అభివృద్ధికి సహకరించరా అంటూ ఒకింత ఆశ్చర్యానికి గురయ్యారు. వైసిపి ప్రభుత్వంలో మనం లేమని, టిడిపి ప్రభుత్వంలో అందరం కలసి అభివృద్ధికి పాటుపడాలని వైద్యులకు సూచించారు. కార్యక్రమంలో ఆస్పత్రి వైద్యులు, సిబ్బంది, టిడిపి నాయకులు పాల్గొన్నారు.

సౌకర్యాలు మెరుగుపర్చాలి

ఆస్పత్రిలో సౌకర్యాలు మెరుగుపర్చాలని ఎమ్మెల్యే అన్నారు. మంగళవారం ఆస్పత్రిలో రోగుల కోసం ఏర్పాటు చేసిన వీల్ చైర్స్‌ను ఎమ్మెల్యే ప్రారంభించారు. ఆస్పత్రిలో చాలా పనులు పెండింగ్‌లో ఉన్నాయని, వాటిని పూర్తి చేస్తే రోగులకు మెరుగైన వైద్య సేవలు అందుతాయని అన్నారు.

జనరల్ వార్డులో రోగితో మాట్లాడుతున్న ఎమ్మెల్యే అదితి విజయలక్ష్మి

9న ఎంఆర్ కాలేజ్‌లో జాబ్‌మేళా

ప్రజాశక్తి-విజయనగరం కోట

నిరుద్యోగ యువతీ యువకులకు వివిధ ప్రయివేటు కంపెనీల్లో ఉద్యోగాలు కల్పించేందుకు ఈ నెల 9న జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా ఉపాధి అధికారి డి.అరుణ ఒక ప్రకటనలో తెలిపారు. సంగీత మొబైల్స్‌లో సేల్స్ ఎగ్జిక్యూటివ్స్, క్యాషియర్, సీనియర్ ఎగ్జిక్యూటివ్, మేనేజర్(రెండు సంవత్సరాల అనుభవం ఉండాలి) తదితర 100 పోస్టులను భర్తీ చేస్తారని, జీతం రూ.13,000 నుంచి రూ.21,000, ఇన్సెంటివ్ ఉంఉందని తెలిపారు. ఎస్ఎస్‌సి, ఇంటర్, డిగ్రీ ఉత్తీర్ణులై ఉండాలని, వయసు 30 ఏళ్ల లోపు, మేనేజర్ పోస్టులకు 33 ఏళ్ల వరకు ఉండాలని, రాష్ట్రంలో ఎక్కడైనా పనిచేయాల్సి ఉంటుందని తెలిపారు.

డెక్కన్ ఫైన్ కెమికల్స్(జెనిక్స్)లో ప్రొడక్షన్‌లో 30, అపరేషన్, మెయింటనెన్స్‌లో 30 పోస్టులను భర్తీ చేస్తారని తెలిపారు. జీతం రూ.19,477 నుంచి రూ.20,535 మధ్య ఉంటుందని, తుని సమీపంలోని కేశవరంలో పనిచేయాల్సి ఉంటుందని తెలిపారు. బిఎస్‌సి కెమిస్ట్రీ, బిజెడ్‌సి, ఎంపిసి, సిబిజెడ్, డిప్లమో ఇన్ కెమికల్, మెకానికల్, బిటెక్ మెకానికల్ ఉత్తీర్ణులై ఉండాలని వయసు 27 సంవత్సరాలు మించకూడదని, 2017-2024 మధ్య ఉత్తీర్ణులై ఉన్న పురుష అబ్యర్థులు మాత్రమే అర్హులని పేర్కొన్నారు.

రిలయన్స్ జియో-ఫైబర్‌లో హోం సేల్స్ ఆఫీసర్ 15 పోస్టులను భర్తీ చేస్తారని, జీతం రూ.15,000, కనీసం ఇంటర్ ఉత్తీర్ణులై ఉండి, వయసు 30 ఏళ్లలోపు ఉండాలని, విజయనగరం జిల్లాలో పనిచేయాల్సి ఉంటుందని, పురుష అభ్యర్థులు మాత్రమే అర్హులని తెలిపారు.

క్రెడిట్ యాక్సిస్ గ్రామీణ్ లిమిటెడ్‌లో ట్రైనీ కేంద్ర మేనేజర్ (ఫీల్డ్ వర్కు)-130 పోస్టుల భర్తీ జరుగుతుందని, జీతం రూ.13,000, పెట్రోల్ ఛార్జ్, ఇన్సెంటివ్, వసతి సదుపాయం కల్పించబడుతుందని, ద్విచక్ర వాహనం కలిగి ఉండాలని, విజయనగరం, విశాఖపట్నం, శ్రీకాకుళం జిల్లాల్లో పనిచేయాల్సి ఉంటుందని, వయసు పురుష అభ్యర్థులకు 18-29 మధ్య, మహిళలకు 18-35 మధ్య ఉండాలని తెలిపారు. ఆసక్తి ఉన్న అభ్యర్థులు ముందుగా తమ పేర్లను ఎంప్లాయిమెంట్. ఎపి.జిఒవి.ఇన్‌లో నమోదు చేసుకొని, ఈ నెల 9న విజయనగరం గంటస్థంభం సమీపంలోని ఎంఆర్ కళాశాలలో ఉదయం 10 గంటలకు జరిగే ఇంటర్వ్యూకు హాజరు కావాలని కోరారు. తమ ఒరిజనల్ సర్టిఫికేట్లు, బయోడేటా, ఆధార్, కేస్ట్ సర్టిఫికెట్ల జెరాక్స్ కాపీలు, రెండు పాస్ ఫొటోలు తీసుకొని రావాలని తెలిపారు. ఇతర వివరాల కోసం సెల్ 8919179415ను సంప్రదించాలని ఎంప్లాయిమెంట్ ఆఫీసర్ అరుణ సూచించారు.

ఎస్‌ఎంసి ఎన్నికలపై అవగాహన ఉండాలి

నెల్లిమర్ల: స్కూల్ మేనేజ్ మెంట్ కమిటి ఎన్నికలపై ప్రభుత్వ పాఠశాలల హెచ్‌ఎంలు, గురుకుల పాఠశాలల ప్రిన్సిపాల్స్‌కు అవగాహన ఉండాలని తహశీల్దార్ సుదర్శనరావు, ఎంపిడిఒ జి.రామారావు అన్నారు. మంగళవారం స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో ఎంఇఒలు యుఎస్ఎన్ మూర్తి, ఈపు విజయకుమార్ ఆధ్వర్యంలో హెచ్‌ఎంల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో తహశీల్దారు సుదర్శనరావు, ఎంపిడిఒ రామారావు మాట్లాడుతూ పాఠశాలల అభివృద్ధికి పేరెంట్స్‌ను భాగం చేసేందుకు ప్రభుత్వం స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీలు ఏర్పాటు చేస్తుందన్నారు. ఈ నెల 8న తేదీన అన్ని ప్రభుత్వ పాఠశాలలో స్కూల్ మేనేజ్మెంట్ కమిటీల ఎన్నికలు జరుగనున్నాయని వివరించారు. ఎన్నికల సమయంలో ఏమైనా అవాంఛనీయ సంఘటనలు జరిగితే వెంటనే పోలీసులకు తెలియజేయాలన్నారు. ఈ సమావేశంలో అన్ని పాఠశాలల హెచ్‌ఎంలు, గురుకుల పాఠశాలల ప్రిన్సిపాల్స్, ఎంఆర్సి సిబ్బంది, సిఎమ్ఓలు పాల్గొన్నారు.

విభిన్న ప్రతిభావంతుడి ఔదార్యం

గజపతినగరం: వైకల్యము శరీరానికి మాత్రమే, మనసుకు కాదని నిరూపించాడు మండలంలోని రంగుపురం గ్రామానికి చెందిన విభిన్న ప్రతిభావంతుడు కొంగ్రోతు లక్ష్మణరావు. అలాగని లక్ష్మణరావు ధనవంతుడు కూడా కాదు. ఓ సామాన్య మధ్యతరగతి కుటుంబీకుడు. అతని మంచి మనసుకు ఇవి ఏవి అడ్డు రాలేదు. వివరాల్లోకి వెళితే.... ఎం. కొత్తవలస ప్రాథమిక పాఠశాలలో చదువుతున్న 19 మంది విద్యార్థులకు మంగళవారం వైట్ యూనిఫార్మ్ అందజేసి లక్ష్మణరావు తన మంచి మనసును చాటుకున్నాడు. ఈ యూనిఫాం కోసం లక్ష్మణరావు ఏడు వేల రూపాయలు ఖర్చు చేశాడు. వీటిని మండల విద్యాశాఖ అధికారిని ఎస్. విమలమ్మ చేతులమీదుగా పాఠశాల ప్రాంగణంలో అందజేశారు. లక్ష్మణరావు మంచి మనసుకు ఎంఇఒ అభినందించారు. లక్ష్మణరావు ఎంతోమందికి స్ఫూర్తిదాయకమని అన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ గెడ్డపు రామకృష్ణారావు, మాజీ సర్పంచ్ పొట్నూరు కృష్ణారావు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

రోడ్డుపై చెత్త వేస్తే జరిమానా

బొబ్బిలి: రోడ్డుపై చెత్త వేస్తే జరిమానా విధించాలని శానిటరీ ఇన్‌స్పెక్టర్ శివను మున్సిపల్ కమిషనర్ ఎల్.రామలక్ష్మి ఆదేశించారు. పట్టణంలోని యాతవీధి, శివాలయం రోడ్డు, పూల్ బాగ్ ప్రాంతాల్లో పారిశుధ్య పనులను ఆమె మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా రోడ్డుపై చెత్త ఉండడంతో ఆమె ఆగ్రహం వ్యక్తం చేశారు. రోడ్డుపై చెత్త వేసిన వారిని గుర్తించి జరిమానా విధించాలన్నారు. రోడ్డు, కాలువలలో చెత్త వేయకుండా పారిశుధ్య కార్మికులకు అందించాలని కోరారు. అపార్ట్‌మెంట్‌లో ఆన్ సైట్ కంపోస్టింగ్‌ను పరిశీలించారు. కార్యక్రమంలో శానిటేషన్ ఉద్యోగులు ఉన్నారు.

డ్రాపౌట్ విద్యార్థులను గుర్తించాలి

తెర్లాం: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఆంధ్రప్రదేశ్ సార్వత్రిక విద్యాపీఠం ద్వారా జరిగే ప్రవేశాలు ప్రక్రియ కోసం మండల స్థాయి సమావేశం మండల విద్యాశాఖ అధికారి జ్యోతిరావు ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా తహశీల్దార్ హేమంత్‌కుమార్ మాట్లాడుతూ గ్రామస్థాయిలో చదువు మధ్యలో ఆపేసిన విద్యార్థులకు ఈ ఓపెన్ స్కూల్ మంచి అవకాశమన్నారు. ఆయా గ్రామ పాఠశాలలో పనిచేస్తున్న ఉపాధ్యాయులు గ్రామాల్లో సర్వే నిర్వహించి 10వ తరగతి వరకు చదివి ఆపేసిన వారికి, ఇంటర్మీడియట్ పూర్తి చేయని వారిని గుర్తించాలన్నారు. సమావేశంలో ఇన్ఛార్జి ఎంపిడిఒ అప్పారావు, మండలంలోని అన్ని స్కూల్ హెచ్‌ఎంలు, ఎంఇఒలు శ్రీధర్‌రావు, అప్పారావు పాల్గొన్నారు.

తైక్వాండో పోటీలకు ప్రకాశరావు

కొత్తవలస: మలేషియా దేశంలో జరుగు తైక్వాండో పోటీలకు ప్రకాశరావు ఎంపికయ్యారు. సెప్టెంబర్ 27,28,29 మలేషియాలో జరుగు ఇంటర్నేషనల్ మలేషియా కప్ ఛాంపియన్ షిప్‌కు కంటకాపల్లి గ్రామానికి చెందిన ముల్లపు ప్రకాశరావు భారతదేశం తరుపున ప్రాతినిధ్యం వహించనున్నారు. ఈయన బంగ్లాదేశ్‌లో జరిగిన ఇంటర్నేషనల్ ఛాంపియన్ షిప్‌లో బ్రాంజ్ మెడల్, థాయ్ ల్యాండ్‌లో జగిన ఇంటర్నేషనల్ తైక్వాండో ఛాంపియన్ షిప్‌లో సిల్వర్ మెడల్ సాధించారు. ఈసారి కూడా తప్పకుండా మెడల్ సాధించాలని పలువురు ఆకాంక్షిస్తున్నారు. ఎంపిక పట్ల తైక్వాండో కౌన్సిల్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ అసోసియేషన్ సభ్యులు హర్షం వ్యక్తం చేశారు.

భీమసింగి ఎమ్‌డిగా సన్యాసినాయుడు

జామి: భీమసింగి సహకార చక్కర కర్మాగారం ఎమ్‌డిగా వి.సన్యాసినాయుడు మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. గత ఎమ్‌డి పిక్టర్ రాజు పదవీ విరమణ పొందిన నేపథ్యంలో చోడవరం ఎమ్‌డిగా పని చేస్తున్న సన్యాసినాయుడుకు అదనపు బాధ్యతలు అప్పగించారు. అందులో భాగంగానే బాధ్యతలు స్వీకరించారు. ఈ మేరకు ఉద్యోగులు నూతన ఎమ్‌డికి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది పాల్గొన్నారు.

మంచినీటి సమస్యను పరిష్కరించండి

వినతి పత్రాన్నిస్తున్న మాజీ సర్పంచ్ త్రివేణి

జామి: ఆరు నెలలుగా జామి గ్రామంలోని దొండపర్తి జంక్షన్ నుంచి అబ్బుల కల్లాల వరకూ వచ్చే వాటర్ పైపు లైన్ పని చేయడం లేదని, గ్రామంలో రెండు పూటల తాగునీటి సరఫరా నిర్వహించాలని మాజీ సర్పంచ్ ఎర్రాప్ప వెంకట త్రివేణి కోరారు. ఈ మేరకు ఇఒపిఆర్‌డి శ్రీదేవికి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, గ్రామంలో జాగారం అన్నమరాజు పేట సాగునీటి కాలువ అపార శుద్దంతో నిండి పోవడంతో గ్రామంలో పలు వీధులు దుర్వాసన వెదజల్లుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ మేరకు జిల్లా కలెక్టరుకు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. ఇప్పటికైనా గ్రామంలోని సమస్యలు పరిష్కారానికి అధికారులు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మాజీ వార్డు మెంబర్ బొట్టా రమణ, ఈశ్వరరావు, యువకులు పాల్గొన్నారు.

దుంగాడ పాఠశాల సందర్శన

వేపాడ: మండలంలోని దుంగాడ ప్రాథమిక పాఠశాలను ఎంఇఒ జి. జగదీశ్వరరావు మంగళవారం సందర్శించారు. పాఠశాల పరిసరాలు, మరుగుదొడ్లను పరిశీలించారు. రోజుకు నాలుగు సార్లు శుభ్రం చేయాలని సూచించారు. తరగతి గదిలో మంచి గోడ పత్రికలతో పాఠశాల నిర్వహణకు సంబంధించిన టైం టేబుల్స్‌ను ఆకర్షణీయంగా ఉంచడాన్ని పరిశీలించారు. ఉపాధ్యాయుల డైరీలు, లెసన్ ప్లాన్లు పరిశీలించారు.

చురుగ్గా పారిశుధ్య పనులు

వేపాడ: మండల కేంద్రంలో రెండు రోజులుగా పారిశుధ్య పనులు చురుగ్గా సాగుతున్నాయి. ప్రధాన రహదారికి ఇరువైపులా ఉన్న కాలువల్లో పేరుకుపోయిన పూడికను కూలీలతో పంచాయతీ కార్యదర్శి బి గౌరీ తీయించి ట్రాక్టర్‌లో వేసి చెత్త నుండి సంపద తయారు చేసే కేంద్రానికి తరలిస్తున్నారు. కాలువలకు ఇరువైపులా ఉన్న పిచ్చి మొక్కలను తొలగిస్తున్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్ద రమణ, వైసిపి వార్డు మెంబరు తదితరులు పాల్గొన్నారు.

గురుకుల విద్యార్థులకు ఆరోగ్య పరీక్షలు

వేపాడ: మండలంలోని బక్కునాయుడుపేటలోని డాక్టర్ బిఆర్ అంబేద్కర్ గురుకులంలో వేపాడ పిహెచ్‌సి వైద్యాధికారి డాక్టర్ ధరణి ఆధ్వర్యంలో మంగళవారం వైద్య శిబిరాన్ని నిర్వహించారు. విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఇంచార్జ్ ప్రిన్సిపాల్ ఎస్. లక్ష్మి సహకారంతో శిబిరం నిర్వహించినట్టు తెలిపారు.

ఎంఇఒ ఆకస్మిక తనిఖీలు

గజపతినగరం: మండలంలోని శివారు గ్రామాలలో గల పలు పాఠశాలలను మంగళవారం ఎంఇఒ ఎస్.విమలమ్మ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఎం. కొత్తవలస, వేమలి, కెంగువ గ్రామాల్లో గల పాఠశాలలను సందర్శించి తనిఖీలు చేపట్టారు. పాఠశాలలకు సంబంధించిన రికార్డులు, రిజిస్టర్స్ క్షుణ్ణంగా పరిశీలించారు. విద్యార్థుల అభ్యసన సామర్థ్య స్థాయిలను ప్రశ్నలు సంధించి తెలుసుకున్నారు. స్కూల్ మేనేజ్మెంట్ కమిటీల (ఎస్ఎంసి) ఎన్నికలకు సంబంధించి తీసుకోవలసిన జాగ్రత్తలపై చర్చించి తగు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో సిఆర్‌పి అమర్నాథ్, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పోక్సో కేసులో నిందితుడికి 20 ఏళ్ల జైలు

ప్రజాశక్తి – రామభద్రపురం

జిల్లాలోని రామభద్రపురం పోలీసు స్టేషన్‌లో 2021లో నమోదైన పోక్సో కేసులో నిందితుడుకు 20ఏళ్ల జైలు, రూ.6వేలు జరిమానా విధించినట్లు ఎస్‌పి ఒక ప్రకటనలో తెలిపారు. రామభద్రపురం మండలం రొంపల్లి గ్రామానికి చెందిన బవిరెడ్డి రవితేజ (28)కు పోక్సో ప్రత్యేక న్యాయమూర్తి కె.నాగమణి పై విధంగా జరిమానా విధిస్తూ మంగళవారం తీర్పు వెలువరించారు. మండలంలోని చెందిన 11 సంవత్సరాల బాలికను రవితేజ మాయ మాటలు చెప్పి బిస్కెట్లు ఇచ్చి, పరిచయం పెంచుకొని, బాలికను తన ఇంటికి తీసుకొని వెళ్ళి, అత్యాచారానికి పాల్పడినట్లుగా బాలిక తల్లి రామభద్రపురం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. అప్పటి ఎస్‌ఐ కృష్ణమూర్తి పోక్సో చట్టం కింద కేసు నమోదు చేశారు. ఈ కేసును అప్పటి దిశ మహిళా పిఎస్ డిఎస్‌పి టి.త్రినాథ్ దర్యాప్తు చేసి, నిందితుడిని అరెస్టు చేసి, కోర్టులో హాజరు పరిచారు. నేరం రుజువు కావడంతో తీర్పు వెల్లడించినట్లు ఎస్‌పి తెలిపారు.

హెచ్చరిక బోర్డులు సరే... అక్రమార్కులపై చర్యలేవి ?

ప్రజాశక్తి – వేపాడ

ఎక్కడ ఏ ప్రభుత్వ భూమి కబ్జా జరిగినా పత్రికల్లో వచ్చిన కథనాలు, ఫిర్యాదులు ఆధారంగా రెవెన్యూ అధికారులు హడావుడి చేసి హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేస్తున్నారు. అంతే తమ పని అయిపోయిందన్నట్లు చేతులు దులుపుకొని వెళ్లిపోతున్నారు. భూ కబ్జాలకు కారణమైన అక్రమార్కులపై మాత్రం ఎటువంటి చర్యలు తీసుకోవడం లేదు. దీనికి అక్రమార్కులతో రెవెన్యూ అధికారులు, సిబ్బంది కుమ్మక్కవ్వడమే కారణంగా తెలుస్తోంది. ఫలితంగా అక్రమార్కులు రెండు మూడు రోజుల తరువాత దర్జాగా హెచ్చరిక బోర్డులను తొలగించి తమ అక్రమాలను కొనసాగిస్తున్నారు.

మండలంలోని కొండగంగుబూడి రెవెన్యూ పరిధిలో ప్రభుత్వ భూములు అన్యాక్రాంతమవుతున్నా అధికార యంత్రాంగం పట్టించుకోవడం లేదు. దీనిపై పలుమార్లు ప్రజాశక్తిలో కథనాలు వెలువడడంతో హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేసి వెనుదిరిగారు. సర్వే నెంబరు1 లో 2 ఎకరాల కొండ పోరంబోకు, 7.22 ఎకరాల భూమి వైసిపి నాయకుని కబంధ హస్తాల్లో ఉంది. సర్వే నెంబరు 27/4లో 39 సెంట్లు ప్రభుత్వ భూమి, సర్వే నెంబరు27/1లో 4.28 ఎకరాల ప్రభుత్వ

కెజీపూడిలో హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేస్తున్న సిబ్బంది

భూమి, సర్వే నెంబరు27/3లో 55 సెంట్లు వాగును కూడా కబ్జాదారులు ఆక్రమించుకున్నారు. గత కలెక్టర్ పత్రికా కథనాలపై స్పందించి రెవెన్యూ డివిజనల్ అధికారిని పంపి దర్యాప్తు జరిపి తగు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. దీంతో ఆర్‌డిఒ కూడా క్షేత్ర స్థాయిలో పరిశీలించి ఆక్రమణలు గుర్తించి హెచ్చరిక బోర్డులను ఏర్పాటు చేశారు. కానీ ఇప్పుడు మరోసారి ఆక్రమణలు తెరపైకి వచ్చాయి. విశాఖ రియల్ ఎస్టేట్ వ్యాపారికి, మండల రెవెన్యూ సిబ్బందికి అవగాహనతోనే ఈ ఆక్రమణలు జరుగుతున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి.

ప్రత్యేక గదిని ఏర్పాటు చేసుకుని..

ప్రభుత్వ భూములను గుర్తించి వాటిని ఆక్రమించుకునేందుకు బొడ్డాం నాలుగు కూడలి రోడ్డు వద్ద కొంత మంది ఒక గదిని అద్దెకు తీసుకున్నారు. ప్రభుత్వ భూముల నెంబర్లను జిరాయితీ భూములుగా మార్చడం, ప్రభుత్వ భూములను గుర్తించడం వంటి కార్యక్రమాలు ఈ గది నుంచే జరుగుతున్నట్లు సమాచారం. వీరు నిత్యం సాయంత్రం 4.30 గంటల తరవాత తహశీల్దార్ కార్యాలయం ఎదుట ప్రత్యక్షమవుతారు. వీరు ఆడిందే ఆట పాడిందే పాటగా రెవెన్యూ కార్యాలయంలో చక చక పనులు జరిగిపోతున్నాయి. ప్రస్తుత జిల్లా కలెక్టర్ బిఆర్ అంబేద్కర్ ప్రత్యేక శ్రద్ధ చూపించి కెజీపూడి, వీలుపర్తి రెవెన్యూ పరిధిలో గల ప్రభుత్వ భూములపై దృష్టి పెట్టాలి. చామలపల్లి గ్రామానికి చెందిన 22 మంది ఎస్‌సి కులస్తులకు జిల్లా షెడ్యూల్ కులాల సంక్షేమసేవా సంఘం భూ అభివృద్ధి పథకం ద్వారా 24 ఎకరాలు కొనిచ్చిన భూమిని కూడా కొంత మంది తప్పుడు ధ్రువ పత్రాలను సృష్టించి మాయాజాలం చేశారు. దీనిపై కూడా ప్రత్యేక శ్రద్ధతో దర్యాప్తు జరిపితే తప్ప వాస్తవాలు వెలుగులోకి రావని పలువురు చెబుతున్నారు.

మాట్లాడుతున్న ఎంపి కలిశెట్టి అప్పలనాయుడు

ధర్నాకు ఎమ్‌పి మద్దతు

ప్రజాశక్తి – బొబ్బిలి

ఢిల్లీలో జంతర్ మంతర్ వద్ద ఆల్ పెన్షనర్స్ అండ్ రిటైర్డ్ పర్సన్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 6,7,8 తేదీల్లో ధర్నాలు నిర్వహించనున్నారు. ఇందులో భాగంగా మొదటి రోజు మంగళవారం ధర్నాలో విజయనగరం ఎంపి కలిశెట్టి అప్పలనాయుడు పాల్గొని ధర్నాకు మద్దతు తెలిపారు. కనీస పెన్షన్ రూ.9వేలు ఇవ్వాలని మీరు చేస్తున్న ధర్నాకు టిడిపి ఎమ్‌పిలు సంపూర్ణంగా మద్దతు ఇస్తున్నామని చెప్పారు. ఆంధ్ర అసోసియేషన్ హాల్లో టిడిపి ఎంపిల సమావేశం ఉందని అందులో మీ సమస్య చర్చించి పెన్షనర్స్ డిమాండ్స్‌ను ప్రధానమంత్రి దృష్టికి తీసుకు వెళ్తామని హామీ ఇచ్చారు. ఈ ధర్నాలో విజయనగరం జిల్లా నుండి పెన్షనర్ సంఘం నాయకులు పి. శంకర్రావు వి. శేషగిరి, ఎ. గౌరీనాయుడు, సిహెచ్. జగన్నాథరావు పెన్షనర్స్ పాల్గొన్నారు.

ఎంపి మద్దతు అభినందనీయం

నెల్లిమర్ల: జంతర్ మంతర్ వద్ద ఫించన్ దార్ల ధర్నాకు ఎంపి కలి శెట్టి మద్దతు అభినందనీయమని ఇపిఎఫ్ ఫించన్ దార్ల సంఘం నాయకులు కిల్లంపల్లి రామారావు, మొయిద పాపారావు తెలిపారు. మంగళవారం వారు విలేకర్లతో మాట్లాడుతూ కనీస ఫించన్ 9వేలు అమలు చేయాలని కోరుతూ ఫించన్ దార్లు ఢిల్లీలో జంతర్ మంతర్ వద్ద ధర్నా చేస్తున్న నేపథ్యంలో విజయనగరం ఎంపి కలిశెట్టి అప్పల నాయుడు మద్దతు తెలపడం శుభపరిణామం అని టిడిపి ఎంపిలు కూడా ఫించన్‌దార్లకు మద్దతు ఇస్తున్నారని కలిశెట్టి అప్పల నాయుడు చెప్పడం అభినందనీయమని చెప్పారు. మద్దతుతో పాటు పెన్షన్ల పెంపుపై కూడా పార్లమెంటులో ప్రశ్నించాలని కోరారు.

కొట్టుకుపోయిన చిట్టగెడ్డ షట్టర్లు

● నాగావళిలోకి వృథాగా పోతున్న సాగునీరు ● రైతులకు తప్పని అగచాట్లు ● స్పందించిన ఇరిగేషన్ అధికారులు

ప్రజాశక్తి – రేగిడి

మండలంలోని సంకిలి గ్రామ సమీపంలో సాయన్న కాలువకు సంబంధించి బ్రిటిష్ నాటి చిట్టగెడ్డ కాలువ షెట్టర్లు సాగునీటి ప్రవాహానికి సోమవారం రాత్రి విరిగి కొట్టుకుపోయాయి. దీంతో రైతులు సాగునీరు కోసం నానా అవస్థలు పడుతున్నారు. సాయన్న ఛానల్ పిల్ల కాలువలు ద్వారా 11,600 ఎకరాలకు సంబంధించి సాగునీరు వెళ్లాల్సి ఉంది. విరిగిన షెట్టర్లు కొట్టుకుపోవడంతో తాత్కాలికంగా రైతులు కర్రలతోనూ, ఇసుక బస్తాలతోను సాగునీరు వృథా పోకుండా అడ్డుకట్ట వేస్తున్నారు. అయినా ఫలితం లేకుండా పోతుంది. చిట్టగెడ్డ కాలువ మరమ్మతులకు గురవటంతో ఇప్పటికే ఖరీఫ్ వ్యవసాయానికి నీరు లేక ఇబ్బందులు పడుతు

వృథాగా పోతున్న నీటికి కర్రలు, ఇసుక బస్తాలు అడ్డుపెడుతున్న రైతులు

న్నామని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వర్షాలు అనుకూలించకపోవడం ఒక ఎత్తయితే, చిట్టగెడ్డ షెట్టర్లు విరిగి కొట్టుకు పోవడంతో సాగునీరు నాగావళి నదిలోకి వృథాగా పోవడంతో ఖరీఫ్ వ్యవసాయం ఎలా జరుగుతుందోనని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయంపై టిడిపి మండల సీనియర్ నాయకులు నారు జనార్ధన్ రావు స్పందించి ఇరిగేషన్ అధికారులకు సమాచారం అందించారు. తక్షణమే స్పందించిన అధికారులు చిట్టగెడ్డ కాలువ పరిస్థితిలను పరిశీలించారు. షెట్టర్లు విరిగిపోవడంతో నీరు వృథాగా పోతుందని శాశ్వత పనులకు ఎమ్మెల్యే కోండ్రు మురళీమోహన్, జిల్లా కలెక్టరు, ఇరిగేషన్ అధికారులకు వినత పూర్వకంగా అందిస్తామని రైతులు తెలిపారు. ఇప్ప టికైనా ఉన్నతాధికారు దృష్టి సారించి, బ్రిటిష్ నాటి కాలువల స్థానాల్లో కొత్త పూనులు ఏర్పాటు చేయాలని రైతుల కోరుతున్నారు.

జల జీవన్ మిషన్ పనులు పరిశీలన

ప్రజాశక్తి – భోగాపురం

మండలంలోని పోలిపల్లి గ్రామంలో జల జీవన మిషన్ కార్యక్రమంలో భాగంగా చేసిన ఇంటింటి కొళాయి పనులను గ్రామీణ నీటి సరఫరా విభాగం డిఇ వైకుంఠం నాయుడు, జెఇ హేమంత్ కుమార్ మంగళవారం పరిశీలించారు. ఇంటింటి కొళాయి పనులు అస్తవ్యస్తంగా చేశారని టిడిపి మండల అధ్యక్షులు కర్రోతు సత్యనారాయణ సోమవారం ఎంపిడిఒకు ఫిర్యాదు చేసిన విషయం తెలిసిందే. దీనిలో భాగంగా అధికారులు గ్రామంలో జరిగిన పనులను పరిశీలించారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం పైపులైన్లు వేసేందుకు జెసిబితో తవ్వకూడదు. కానీ కాంట్రాక్టర్ చక్కగా ఉన్న సిమెంట్ రహదారులను జెసిబిలతో తవ్వేసి సిమెంట్ రహదారులను నాశనం చేశారని సత్యనారాయణ అధికారులకు తెలిపారు. వర్షం పడితే చాలు సిమెంట్ రహదారి బురదమయంతో రాకపోకలు చేసేందుకు కూడా ఇబ్బందులు పడుతున్నామని అధికారులకు

తవ్వేన రోడ్డును అధికారులకు చూపిస్తున్న కర్రోతు

వివరించారు. పైపులైను కోసం కాలువను తవ్వేసారని ఆయనకు చూపించారు. కొళాయి ట్యాప్‌లు నాణ్యత లేనివి వేయడంతో పనిచేయడం లేదని చూపించారు. పనులు పూర్తి కాకుండానే నీటిని ఎలా వదులుతారని ఆయన ప్రశ్నించారు. ఇష్టానుసారంగా కాంట్రాక్టర్ రహదారులు తవ్వేసారని తెలిపారు. దీనిపై డిఇ మాట్లాడుతూ సంబంధిత కాంట్రాక్టర్‌ను పిలిపించి మాట్లాడి రహదారులను యధావిధిగా వేయిస్తామని అన్నారు.

ఆశీల వసూళ్లపై చర్చ

ప్రజాశక్తి – కొత్తవలస

కొత్తవలస మేజర్ పంచాయతీ సర్వసభ్య సమావేశం మంగళవారం పంచాయతీ సమావేశ మందిరంలో సర్పంచ్ మచ్చ ఎర్రయ్య రామస్వామి ఆధ్వర్యంలో నిర్వహించారు. సమావేశంలో ఆసీల వసూళ్లపై చర్చ జరిగింది. ఎన్నికల అనంతరం మొదటి సర్వసభ్య సమావేశం కార్యాలయంలో స్టేషనరీ, పారిశుధ్య కార్మికుల కాంట్రాక్ట్, సులబ్ కాంప్లెక్స్ వేలం పాట, పాత దినపత్రికలు, కొబ్బరి చెట్ల వేలంపాట, అంశాలను పంచాయతీ కార్యదర్శి రత్న మాలిక సభ్యుల దృష్టికి తీసుకురాగా ఏకగ్రీవ ఆమోదం తెలిపారు. పంచాయతీ పరిధిలో డైలీ మార్కెట్ ఆసీల వేలం పాట కోసం సభ దృష్టికి తీసుకురాగా, ఇఒపిఆర్‌డి కర్రీ ధర్మారావు జిల్లా అధికారుల ఆదేశాల ప్రకారం ఆసీల ద్వారా వేరే రూపాన ఏవైనా ఆదాయం వచ్చే అవకాశం ఉంటే ఆ అంశంపై దృష్టి పెట్టాలని సూచించారని, లేనియెడల పంచాయతీ పాలక వర్గ సభ్యుల ఆమోదంపై పాటదారునికి షరతులతో కూడిన అనుమతులు ఇవ్వాలని తెలిపారు. దీనిపై వార్డు నెంబర్ గొరపల్లి రాము అభ్యంతరం వ్యక్తం చేస్తూ కొత్తవలస మేజర్ గ్రామ పంచాయతీ ఆసీల వసూళ్లు గత నాలుగు నెలలలో ఎవరు చేశారు? రోజుకి ఎంత చేశారు? లిఖితపూర్వకంగా ఇచ్చారా లేదా అనేది తెలపాలన్నారు. వేలంపాట జరిగిన దానిలో నిష్పత్తి ప్రకారంగా లెక్క వేసుకున్న నెలకు సుమారు లక్ష రూపాయలు

మాట్లాడుతున్న సర్పంచ్ రామస్వామి

రావాలని అటువంటిది నాలుగు నెలలకు గాను 88 వేల రూపాయలే రావటం ఏంటని లెక్కలు తేల్చాలని అన్నారు. వార్డు నెంబర్ 10 పరిధిలో గల కుమ్మరి వీధిలో గల సుమారు 500 మీటర్ల కాలువపై గల పలుకులను తొలగించి వాటి స్థానంలో సీసీ రోడ్డును నిర్మించారని కాలువపై తీసిన పలకలను మేజర్ గ్రామపంచాయతీకి అప్ప చెప్పాల్సి ఉన్న అమ్మి సొమ్ము చేసుకున్నారని వాటిపై విచారణ చేసి లెక్క తేల్చాలని ఇఒపిఆర్‌డిను కోరారు. దీనిపై పై అధికారుల దృష్టికి తీసుకు వెళ్తామని ఇఒపిఆర్‌డి తెలిపారు.

తల్లిపాలతో వ్యాధి నిరోధక శక్తి : ఆర్‌డిఒ

ప్రజాశక్తి – బొబ్బిలి

తల్లిపాలతో పిల్లలకు వ్యాధి నిరోధక శక్తి పెరుగుతుందని ఆర్‌డిఒ ఎ.సాయిశ్రీ అన్నారు. స్థానిక ఐసిడిఎస్ కార్యాలయంలో మంగళవారం తల్లిపాల వారోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తల్లిపాలతో పిల్లలు సంపూర్ణ ఆరోగ్యంగా ఉంటారన్నారు. తల్లిపాలు తాగిస్తే వ్యాధి నిరోధక శక్తి పెరుగుతుందని, పిల్లలు పుట్టిన వెంటనే తల్లిపాలు తాగించాలని సూచించారు. మున్సిపల్ కమిషనర్ ఎల్.రామలక్ష్మి మాట్లాడుతూ తల్లిపాలు ప్రాముఖ్యతను గర్భిణులు, బాలింతలకు వివరించాలన్నారు. గర్భిణులు ఆరోగ్యంగా ఉండేందుకు పౌష్టికాహారం తీసుకోవాలని కోరారు. పిపి యూనిట్ వైద్యాధికారి సంతోషిణి మాట్లాడుతూ బిడ్డకు జన్మనిచ్చిన వెంటనే తప్పనిసరిగా తల్లిపాలు తాగించాలన్నారు. పిల్లలు ఎన్నిసార్లు అడిగితే ఎన్నిసార్లు పాలు పెట్టాలన్నారు. ఐసిడిఎస్ సిడిపిఒ జె.విజయలక్ష్మి మాట్లాడుతూ తల్లిపాలు ప్రాముఖ్యతను చెప్పేందుకు తల్లిపాల వారోత్సవాలు నిర్వహిస్తున్నామని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఒ రవికుమార్, ఐసిడిఎస్ సూపర్ వైజర్లు, అంగన్వాడీలు, గర్భిణులు పాల్గొన్నారు.

బొబ్బిలి: మాట్లాడుతున్న ఆర్‌డిఒ సాయిశ్రీ

శృంగవరపుకోట: తల్లి పాలతోనే బిడ్డకు ఆరోగ్యమని ఐసిడిఎస్ ఎస్‌కోట ప్రాజెక్ట్ సిడిపిఒ ఉమా తెలిపారు. మంగళవారం పట్టణంలోని మండల పరిషత్ అభివృద్ధి కార్యాలయంలో తల్లిపాల వారోత్సవాల కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా తల్లిపాల ప్రాముఖ్యత గురించి ముర్రుపాల గురించి తల్లి బిడ్డల శ్రేయస్‌లో మన పాత్ర ఏమిటి అనే అంశాలను గూర్చి సిడిపిఒ ఉమా ప్రసంగించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్లు, ఎంఇఒ లక్ష్మీ, ఎపిఒ తిరుపతి, అంగన్వాడి వర్కర్లు, హెల్పర్లు పాల్గొన్నారు.

ర్యాగింగ్ నిర్మూలనపై అవగాహన

ప్రజాశక్తి – డెంకాడ

ఎంవిజిఆర్ ఇంజినీరింగ్ కళాశాలలో మంగళవారం ఎన్ఎస్ఎస్ యూనిట్, జిల్లా పోలీసు అథారిటీ సంయుక్తంగా విద్యార్థులపై ర్యాగింగ్ నిర్మూలన, ర్యాగింగ్ ప్రభావంపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా భోగాపురం సిఐ జి. రామకృష్ణ మాట్లాడుతూ ఎంవిజిఆర్ క్యాంపస్‌లో ర్యాగింగ్ పాల్పడకుండా ర్యాగింగ్ ఫ్రీగా తీర్చిదిద్దినందుకు యాజమాన్యాన్ని అభినందించారు. విద్యార్థులు తమ లక్ష్యాలను సాధించిడంపై దృష్టి పెట్టాలన్నారు. క్యాంపస్‌లో ఎలాంటి ర్యాగింగ్ కార్యకలాపాలు జరిగినా ఫిర్యాదు చేసేందుకు 100, 112 టోల్ ఫ్రీ నంబర్లను వినియోగించుకోవాలని సూచించారు. ఎంవిజిఆర్ డైరెక్టర్ ప్రొఫెసర్ పి. సీతారామరాజు మాట్లాడుతూ ర్యాగింగ్ అనేది ఒక రకమైన శాడిజం అని, విద్యార్థులకు పరిచయం కోసం ర్యాగింగ్‌ను మాధ్యమంగా వినియోగిస్తున్నారని అన్నారు. అనంతరం డైరెక్టర్ పి. సీతారామరాజు, సిఐ జి.రామకృష్ణ, డెంకాడ ఎస్ఐ కృష్ణమూర్తి, ఎంవిజిఆర్ సిబ్బంది యాంటీ ర్యాగింగ్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఎంవిజిఆర్ ఎన్ఎస్ఎస్, ఎన్‌సిసి యాంటీ ర్యాగింగ్ కోఆర్డినేటర్ డాక్టర్ ఎం. అనిల్ ప్రకాష్, ఎన్ఎస్ఎస్ పిఒ ఎన్ షణ్ముఖరావు, ఎంవిజిఆర్ సిబ్బంది, ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

పోస్టర్ ఆవిష్కరిస్తున్న సిఐ, కళాశాల యాజమాన్యం

చెరకు సాగుపై రైతులకు అవగాహన

ప్రజాశక్తి – రేగిడి

మండలంలోని సంకిలి ఇఐడి పారి సుగర్స్ చెరకు అభివృద్ధి కార్యాలయం వద్ద మంగళవారం చెరకు పంట సాగుపై రైతులకు ఆ సంస్థ డిజిఎం ఆర్ అండ్ హెడ్ డి.షణ్ముఖరావు, కేన్ డిజిఎం రమేష్ కుమార్ అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఉమ్మడి శ్రీకాకుళం, విజయనగరం జిల్లాలో చెరుకు రైతులు చెరకు పంటలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. చెరుకు పంటలలో నాలుగు అడుగుల సాళ్ల మధ్య దూరం పంటలు పండిస్తే దిగుబడితోపాటు, కూలీల కొరత సమస్య అధిగమించవచ్చునన్నారు. ముందుగా భూ సారం చేయాలని, వాటికి సంబంధించి రకాలను చెరుకును నాటితే దిగుబడులు వస్తాయన్నారు. వాణిజ్య పరమైన చెరకును విస్తీర్ణం పెంచేందుకు కృషి చేయాలని కోరారు. కర్మాగారం యాజమాన్యం సూచించిన పద్ధతిలో చెరుకు నాటినట్లయితే ఎక్కువ దిగుబడులు సాధించి రైతులు ఆర్థికంగా బలోపేతం కావచ్చును అని తెలిపారు.

ఉత్తమ చెరకు రైతులకు ఘన సన్మానం

గతేడాది నాలుగు అడుగుల సాళ్ల మధ్య దూరం చెరకు పండించి, దిగుబడులు సాధించిన ఉత్తమ రైతులు సంకిలికి చెందిన మాచర్ల శ్రీనివాసరావు, కొమిరి వెంకటాపురానికి చెందిన కింజరాపు సురేష్ కుమార్, వండానపేట గ్రామానికి చెందిన సోమినాయుడు, కొత్తూరు రామచంద్ర పురానికి చెందిన రాజగోపాలం, గంద్రసన్ గ్రామానికి చెందిన గంటా శ్రీనివాసరావులకు డిజిఎమ్ ఆర్‌అండ్‌డి హెడ్ షణ్ముఖ చంద్ర, కేన్ డిజిఎం రమేష్‌కుమార్, దుస్సాల వాళ్ళతో ఘనసన్మానం చేశారు. వీరితోపాటు జోనల్ మేనేజర్లు కమలా పట్నాయక్, మురళి, సిడిఒ సంతోష్ కుమార్ సాహూ ఉన్నారు.

రైతును సత్కరిస్తున్న ప్రతినిధులు

డ్రమ్ సీడర్‌తో అధిక దిగుబడి : ఎడిఎ

ప్రజాశక్తి – డెంకాడ

డ్రమ్ సీడర్ విధానంతో వరి వేస్తే ఖర్చు తగ్గి అధిక దిగుబడి వస్తుందని ఎడిఎ ఎ. నాగభూషణరావు తెలిపారు. మండలంలోని డి. తాళ్లవలస గ్రామంలో నారు రమణ పొలంలో మంగళవారం డ్రమ్ సీడర్ విధానంలో నాట్లు వేసే కార్యక్రమాన్ని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రమణ తన నాలుగు ఎకరాల పొలంలో డ్రమ్ సీడర్ విధానంలో ఎంటియు 1121 రకం వరి వేశారన్నారు. ఈ పద్ధతిలో ఒక ఎకరా ఎత్తడానికి కేవలం ఇద్దరు కూలీలు సరిపోతారన్నారు డ్రమ్ సీడర్ యంత్రం నాగడానికి ఒకరు గింజలు ఎత్తడానికి తాడు మార్చడానికి ఇంకొకరు అయితే సరిపోతారని తెలిపారు. రకాన్ని బట్టి ఎకరాకు 13 నుంచి 15 కిలోల విత్తనాలు అవసరమవుతాయని చెప్పారు. ఒక ఎకరా విత్తడానికి సాధారణంగా 120 నిమిషాలు అంటే రెండు గంటలు సరిపోతుందని తెలిపారు. డ్రమ్ సీడర్ పద్ధతిలో సాగు చేస్తే ఏ రకమైన వారం నుండి పది రోజులు ముందుగానే కోతకు వస్తుందన్నారు. మామూలు పద్ధతిలో పోలిస్తే ఈ పద్ధతిలో పది నుంచి పదిహేను శాతం అధిక దిగుబడి వస్తుందని తెలిపారు. ఖర్చు తగ్గుతుంది కాబట్టి రైతులందరూ ఈ విధానాన్ని వినియోగించుకోవాలని కోరారు. ఈ

డ్రమ్ సీడర్ విధానాన్ని పరిశీలిస్తున్న అధికారులు

కార్యక్రమంలో ఎఒ పి.నిర్మల మాజీ జెడ్పిటిసి పతివాడ అప్పలనారాయణ, గ్రామ వ్యవసాయ శాఖ అధికారులు, రైతులు పాల్గొన్నారు.

బాడంగి: మండలంలోని పినపెంకి గ్రామంలో వరి తాడు సహాయంతో వరి నాట్లు (లైన్ ప్లాంటింగ్) వేపించినట్లు వ్యవసాయ సహాయకులు వాడాడ సాయికుమార్ తెలిపారు. వరుసల్లో వరినాట్లు వేసుకోవడం గాలి వెలుతురు చేనుకు బాగా తగిలి సాధారణం ఉడుపు కన్నా ఎక్కువగా పిలకలు పెట్టి దుబ్బు బాగా చేస్తుందన్నారు. తద్వారా దిగుబడి బాగుంటుందని చెప్పారు. వరుసల్లో నాటడం వల్ల చీడపీడలు ఉనికి గమనించి సస్యరక్షణ చర్యలు సకాలంలో చేయడానికి అవకాశం ఉంటుందన్నారు.

గద్దర్‌కు ఘన నివాళి

మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ కేశవరావు

శృంగవరపుకోట: యుద్ధనౌక గద్దర్ వర్ధంతి కార్యక్రమాన్ని స్థానిక ప్రభుత్వ కళాశాలలోని తెలుగు శాఖ ఆధ్వర్యంలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సంస్మరణ సభలో కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ సి.హెచ్.కేశవరావు మాట్లాడుతూ ప్రజా గాయకుడిగా, యుద్ధనౌకగా, చైతన్య ప్రేరకుడిగా జనుల హృదయాల్లో నిలిచిపోయిన గద్దర్ అసలు పేరు గుమ్మడి విఠల్ రావని, నేటి తెలంగాణ రాష్ట్రంలోని నిజామాబాద్ జిల్లాలో తూప్రాన్ అనే ఊర్లో 1949 జనవరి 31న గద్దర్ జన్మించారని గుర్తు చేశారు. ఆ రోజుల్లోనే ఇంజనీరింగ్ వంటి ఉన్నత విద్యని అభ్యసించి కెనరా బ్యాంకులో ఉద్యోగంలో చేరాడని, జన నాట్య మండలి వైపు ఆకర్షితుడై ప్రజా సమస్యల పట్ల, సామాజిక మైన అంశాల పట్ల ప్రజలకు అవగాహన కలిగిస్తూ చక్కటి పాటల రూపంలోనూ, ఆట రూపంలోనూ చైతన్య పరిచే వాడని చెప్పారు. ఆ తర్వాత తెలంగాణ ఉద్యమంలోనూ కీలక పాత్ర పోషించాడని గద్దర్ సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో కళాశాల తెలుగు విభాగాధిపతి డాక్టర్ రేచర్ల శ్రీలక్ష్మి, కళాశాల అధ్యాపకులు ఎన్ఎస్ఎస్ పిఒ పి.భాస్కర్, వలీఖాన్, లక్ష్మణ్ శివకుమార్, రామకృష్ణ, అప్పలరాజు పాల్గొన్నారు.

పిట్టాడ ఫీల్డ్ అసిస్టెంట్‌పై విచారణ

ప్రజాశక్తి – మెంటాడ

మండలంలోని పిట్టాడ పంచాయితీకి చెందిన ఫీల్డ్ అసిస్టెంట్ కాపారపు సత్య నారాయణ ఉపాధి పనుల్లో పలు అవకతవకలకు పాల్పడినట్లు రెడ్డి ఆదినారాయణ ఇచ్చిన ఫిర్యాదు మేరకు మంగళ వారం సచివాలయ భవనంలో డ్వామా ఎపిడి శారద విచారణ చేపట్టారు. విచారణలో ఉపాధి పనులకు వెళ్ళని వారికి జాబ్ కార్డులు సృష్టించి వారికి మస్తర్లు వేసి కూలీ డబ్బులు బ్యాంకుల లోపడిన తరువాత వారితో విత్ డ్రా చేయించి ఫిల్డ్ అసిస్టెంట్ తీసుకున్నారని కుచ్చు రామచంద్రుడు విచారణలో వెల్లడించారు. గ్రామంలోని లేని వారి పేరు మీద మస్తర్లు వేసి సొమ్ము కాజేసినట్లు, వేతనదారుల పేరుతో 14 సంవత్సరాల చిన్న పిల్లలను పనులు చేయించి పెద్ద వారికి మస్తర్లు వేయడం జరిగినట్లు చుక్క అప్పారావు ఎపిడి శారద వద్ద ప్రస్తావించారు. విచారణలో వేతనదారుల నుంచి ఉపాధి పనుల తీరు, అవక తవకలపై ఆరా తీశారు. ఈ కార్యక్రమంలో ఉపాధి పథక మండల జెఇ దుర్గా ప్రసాద్, టెక్నికల్ అసిస్టెంట్‌లు, గ్రామ పెద్దలు చుక్క అప్పలనాయడు, రెడ్డి చంద్ర రావు, రొంగళి శంకర రావు, రొంగళి గోపి తదితరులు పాల్గొన్నారు.